మెదక్ మున్సిపాలిటీ: రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

పాపన్నపేటలో నిర్వహించిన రాస్తారోకోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాపన్నపేటలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- కాలయాపనకే మంత్రుల సబ్ కమిటీ
- మాటలతో మభ్యపెడుతున్న రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ పథకాలను పునరుద్ధరించాలి
- రైతుభరోసాను వెంటనే ఖాతాల్లో వేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- రాస్తారోకో, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

రైతు భరోసాకు ఎగనామం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 20: రైతు భరోసాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎగనామం పెట్టారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. రైతు భరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పెట్టుబడి సాయంపై చేతులెత్తేసి రైతులకు మొండి చేయి చూపించాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని గప్పాలు కొట్టారన్నారు. మంత్రులతో సబ్ కమిటీ వేసి కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రైతులను మోసం చేస్తున్నదన్నారు. రేగోడ్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద మండల పార్టీ అధ్యక్షుడు బుచ్చయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

రామాయంపేటలో

రైతుబంధు వేయకుండా హామీలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్‌రెడ్డి గదెద్దిగాలని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ రోడ్డుపై అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా, నిరసన, రాస్తారోకో చేపట్టి, సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

చేగుంటలో..

రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులుడు కొమండ్ల నారాయణరెడ్డి, మైలరాం బాబు, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిందం సబీతా రవీందర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట, నార్సింగి మండలాల్లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

చిన్నశంకరంపేటలో..

వ్యవసాయశాఖమంత్రి తుమ్మలనాగేశ్వరరావు ప్రకటనతో రైతులు భగ్గుమన్నారు. రైతుభరోసా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చిన్నశంకరంపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. టేక్మాల్ చౌరస్తాలో రైతు భరోసా ఎగవేతపై పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు.

చిలిపిచెడ్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

చిన్నశంకరంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు

తూప్రాన్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

అల్లాదుర్గం: రైతు భరోసా ఎగవేతపై నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

టేక్మాల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

రేగోడ్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

చేగుంట, అక్టోబర్ 20: పరిస్థితి విషమించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మాసాయిపేటలో ఆదివారం జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేటకు చెందిన తలారి బాబు(40) వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. శనివారం రాత్రి మాసాయిపేట ఆటో స్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వచ్చిన బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాబును 108 వాహనంలో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

గేదెల చోరీకి యత్నం

శివ్వంపేట, అక్టోబర్ 20: గేదెల చోరీకి దుండగులు యత్నించిన ఘటన శివ్వంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన బొడ్డు నర్సింలు శివ్వంపేట– ఎదుల్లాపూర్ ప్రధాన రోడ్డు పక్కన తన పొలంలోని పాకలో పాడిగేదెలు కట్టేశాడు. దుండగులు పాకలోకి ప్రవేశించి గేదెల తాళ్లను విప్పి దొంగలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో శబ్దం రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు.

బీటీ రోడ్లకు నిధులు మంజూరు

నర్సాపూర్, అక్టోబర్ 20: నియోజకవర్గంలోని పలు మండలాల బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.5 కోట్లు విడుదల య్యాయన్నారు. నర్సాపూర్ మండలంలోని మూసాపేట్ నుంచి దౌల్తాబాద్ రోడ్డుకు రూ.కోటి, తుజాల్‌పూర్ జడ్పీ రోడ్డు నుంచి ఖాజీపేట్ వరకు రూ.50.35 లక్షలు, మాసాయిపేట్ మండలంలోని పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి హకీంపేట్‌కు రూ.183.75 లక్షలు, జడ్పీ నుంచి నాగ్‌సాన్‌పల్లికు రూ. 165.90 లక్షలు మంజూరు చేశారన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీకి గత ప్రభుత్వం విడుదల చేసిన నీటి ట్యాంకులు, పైప్‌లైన్లకు రూ.12 కోట్లు విడుదల చేసిందన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు చందాయిపేట విద్యార్థిని ఎంపిక

దీప్తి

చేగుంట,అక్టోబర్20: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు మండలంలోని చందాయిపేట జడ్పీ హెచ్ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని దీప్తి ఎంపికైనట్లు హెచ్ఎం కిషన్ ఆదివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఖోఖో బాలికల విభాగంలో దీప్తి ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీల్లో దీప్తి పాల్గొననున్నట్లు తెలిపారు. దీప్తిని పీఈటీ శంకర్, టీచర్లు విఠల్‌రెడ్డి, నర్సింలు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, అక్టోబర్ 20: రామాయంపేట పురపాలిక పరిధిలోని గిరిజన తండాకు చెందిన గుగులోత్ సామ్యా నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఎల్‌వోసీ అందజేత

శివ్వంపేట, అక్టోబర్ 20: మండలంలోని కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన మంగలి భిక్షపతి అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎల్‌వోసీ దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి రూ.2లక్షల50వేల ఎల్‌వోసీ మంజూరైంది. ఈ చెక్కును పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి అందజేశారు.

చెక్కు అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలిపిచెడ్, అక్టోబర్ 20: మండలంలోని చిట్కుల్‌లో వెలిసిన చాముండేశ్వరీ ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రధాన పూజరి ప్రభాకరశర్మ అమ్మవారికి అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

వాలీబాల్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా విజేత

విజేతలకు కప్ అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేశ్ తదితరులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 20: ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్–17 బాల బాలికలకు ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని గీతా హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో మెదక్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్‌జీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి రమేశ్ తెలిపారు. మెదక్ జిల్లా బాలుర జట్టు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా జట్లను ఓడించి విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో సంగారెడ్డి జిల్లా జట్టు నిలిచింది. బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా జట్టు సిద్దిపేట, మెదక్ జిల్లాల జట్లపై విజయం సాధించి విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో సిద్దిపేట జిల్లా , తృతీయ స్థానంలో మెదక్ జిల్లా జట్టు నిలిచింది. విజేతలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేశ్, గీత హైస్కూల్ ప్రిన్సిపాల్ సుగుణాకర్ బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జట్ల నుంచి ఉమ్మడి జిల్లా జట్టుకు 17 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 28వ తేదీన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో వీరు పాల్గొనున్నారు. ఈ పోటీల్లో వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, మాధవరెడ్డి, వినోద్ కుమార్, నరేశ్, పద్మ, అరుణ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, మనోహర్, శేఖర్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలో గురుకుల విద్యార్థినికి అవార్డు

అవార్డును అందుకుంటున్న కార్తీక

తూప్రాన్, అక్టోబర్ 20: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలో తూప్రాన్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ (గర్ల్స్) విద్యార్థిని కార్తీక సత్తా చాటింది. ఈనెల 18 నుండి 20 వరకు వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాలికల ఛాంపియన్ షిప్‌లో మెదక్ జిల్లా బాలికల జట్టు కాంస్య పథకాన్ని సాధించింది. జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కార్తీక ఛాంపియన్ షిప్‌లో బెస్ట్ ఆల్ రౌండర్‌గా అవార్డు సాధించడం అభినందనీయమని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్త, కోచ్ శ్యామ్ సుందర్ తెలిపారు.

ఇందిరమ్మ కమిటీలో గ్రూపు రాజకీయాలు

మండల పార్టీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించిన చిల్వెర కాంగ్రెస్ నాయకులు

అల్లాదుర్గం, అక్టోబర్ 20: కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు భగ్గుమన్నాయి. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను గ్రామ సభలు నిర్వహించి వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అల్లాదుర్గం మండల పరిధిలోని చిల్వెర గ్రామంలో ఇందిరమ్మ కమిటీ వేసే క్రమంలో గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనకు అనుకూలంగా ఉన్న వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడంతో మరో వర్గం వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండల అధ్యక్షుడికి వ్యతిరేకంగా చిల్వెర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. కేవలం ఆయనకు అనుకూలంగా ఉన్నవారికే కమిటీలో ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. కలిసి ఉంటున్న గ్రామాల్లో గ్రూపులను ప్రోత్సహిస్తూ పార్టీకి చెడ్డపేరు తెచ్చే వ్యక్తులపై మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడాల్సిన అధ్యక్షుడే పార్టీ కట్టుబాట్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీలో తమకు స్థానం ఇవ్వకున్నా పార్టీలో కనీస గౌరవం కల్పించాలన్నారు.

భక్తులతో కిక్కిరిసిన దుర్గమ్మ సన్నిధి

పూజలు అందుకుంటున్న దుర్గామాత.. ఆలయంలో భక్తుల సందడి

పాపన్నపేట, అక్టోబర్20: ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత సన్నిధి ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మచారి, రవివీర్‌కుమార్, వరుణాచారి, రాజు, నర్సింలు, పండితులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, రాముశర్మ, రాజశేఖర్ శర్మ పూజలు చేశారు.

మహా దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ప్రార్థనల్లో భక్తులు దైవ సందేశం వినిపిస్తున్న ప్రేసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 20: మెదక్‌లోని మహా దేవాలయం (చర్చి)లో యేసయ్య భక్తి గీతాలు పాడుతూ భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఆదివారం కావడంతో భక్తులు, పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని యేసయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. చర్చి ప్రెసీబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులకు దైవ సందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్ రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్ దీవించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

చిన్నశంకరంపేట, అక్టోబర్ 20: సూరారం గ్రామానికి చెందిన మత్తడి దవాఖానలో చికిత్స చేయించుకున్నాడు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ రూ.15వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు.

మూఢనమ్మకాలను నమ్మొద్దు:ఎస్సై

తూప్రాన్, అక్టోబర్ 20: మూఢనమ్మకాలను వీడి, విజ్ఞానం వైపు పయనించాలని తూప్రాన్ ఎస్ఐ శివానందం అన్నారు. మంత్రాల నెపంతో కిష్టాపూర్ గ్రామానికి చెందిన భూమెళ్ల స్వామి కుటుంబంపై కొందరు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం కిష్టాపూర్ గ్రామస్తులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శివ్వంపేట, అక్టోబర్ 20: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన శంకర్ గౌడ్ శనివారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉన్న విషయం గుర్తించిన పక్కింటివారు శంకర్‌గౌడ్‌కు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసే సరికి బీరువాలోని అరతులం బంగారం, 25 తూలాల వెండి వస్తువులు, నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేటలో శ్రీరామ ధనుస్సు శోభాయాత్ర

రామాయంపేట, అక్టోబర్ 20: పట్టణంలోని కోదండ రాముడి ధనుస్సు శోభాయాత్ర ఘనంగా ఆదివారం కొనసాగింది. రామాయంపేటకు చేరుకున్న శోభాయాత్ర మహంకాళి ఆలయం నుంచి కోదండ రామాలయానికి చేరింది. అయోధ్య భాగ్యనగర సీతారామసేవ సమితీ ఆధ్వర్యంలో రామ ధనుస్సుకు పూజలు చేశారు. మద్దూరి వెంకట శ్రీనివాసరావు కిలో బంగారం, 13కిలోల వెండితో ధనుస్సును తయారు చేయించారు.

నిజాంపేటలో ఓపెన్ జిమ్ ప్రారంభం

ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, అక్టోబర్ 20 : నిజాంపేటలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. జిమ్ కోసం రూ.లక్ష విరాళం అందజేసిన కంఠారెడ్డిని ఆరోగ్యమే మహాభాగ్యం టీమ్ సభ్యులు సత్కరించారు. తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు సుప్రియ, సుమశ్రీకి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు ద్వారా కంఠారెడ్డి రూ.10 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, చింతల స్వామి, మాజీ ఉపసర్పంచ్ బాబు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

అప్రకటిత కోతలతో అల్లాడుతున్న జనం

పిచ్చిమొక్కలతో కప్పబడిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా

రేగోడ్, అక్టోబర్ 20: మండలంలోని ఆయా గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్చు తగ్గుల విద్యుత్ సరఫరాతో ఇండ్లలో ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. మరమ్మతుల పేరిట మర్పల్లి, పోచారం, ప్యారారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారి యాసిన్ దృష్టికి తీసుకెళ్లగా ఓవర్‌లోడ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

క్రీడాకారులకు సామగ్రి అందజేత

సంబంధించిన కిట్లు అందజేశారు.

నర్సాపూర్, అక్టోబర్ 20: నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు కాంగ్రెస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్ సహకారంతో స్థానిక నాయకు డు నర్సింగరావు క్రీడాసామాగ్రిని ఆదివారం అందజేశారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, పిల్లలకు స్కిప్పింగ్, రింగ్, ఫుట్‌బాల్ ఆటలకు

తూప్రాన్‌కు చెందిన వ్యక్తికి గౌరవ డాక్టరేట్

డాక్టరేట్ పురస్కారం అందుకుంటున్న జానకీరామ్

తూప్రాన్, అక్టోబర్ 20: తూప్రాన్‌కు చెందిన సంఘ సేవకుడు జానకీరామ్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. అమెరికాలోని తియోలాజికల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్ ఫిడ్రిడ్, డాక్టర్ వెంకటస్వామి ఆదివారం హైదరాబాద్‌లో ఈ పురస్కారాన్ని అందజేశారు. నలభై ఏండ్లుగా పాత్రికేయ వృత్తిలో రాణిస్తున్నారు. లయన్స్ క్లబ్ జోన్, డిస్ట్రిక్ చైర్మన్‌గా పదేళ్లుగా సేవలందిస్తున్నారు. జానకీరామ్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం రావడం పట్ల తూప్రాన్ పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.